

అభివృద్ధి నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలోని హరనాథపురం నుంచి ముత్తుకూరు రోడ్డు కు వెళ్లే కూడలిలో అవసరమైన అభివృద్ధి నిర్మాణాలను చేపట్టి, ప్రయాణికులకు రవాణా మార్గాన్ని సుగమం చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ పట్టణ ప్లానింగ్, హెల్త్, ఇంజినీరింగ్ విభాగం అధికారులను నిర్దేశించారు. అధికారులతో కలిసి ముత్తుకూరు రోడ్డు కూడలి, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, చిల్డ్రన్స్ పార్కు మార్గం వెంట పరిసరాలను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులకు ఈ ప్రాంతంలో కావాల్సిన రక్షణ ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

మాట్లాడుతున్న కమిషనర్

27న కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా

నిర్బంధ అణిచివేతలకు వ్యతిరేకంగా

రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్షాలు

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్బంధ ధోరణి, నిర్బంధ, అణిచివేతలకు వ్యతిరేకంగా ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు, ప్రజాసంఘాలు సంయుక్తంగా ధర్నా కార్యక్రమం నిర్వహించాలని పిలుపు నిచ్చాయి. శుక్రవారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ ఛార్జీల పెంపు, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలకు పిలుపు నిచ్చిన సమయంలో గృహ నిర్బంధాలు, అరెస్టులు వాటిలి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడటాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచి ప్రజలపై భారాలు మోపుతుందన్నారు.గతంలో ఒక ఇంటికి వెయ్యి రూపాయలు వంతున విద్యుత్ ఛార్జీలు వసూలు చేసే ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో దాదాపుగా రూ.3 వేల వరకు వసూలు చేస్తుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులకు గురౌతున్న తరుణంలో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను ఈ తరహాలో పెంపుదల చేయడం దారుణమన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో మోటార్లకు మీటర్లు బిగించి రైతాంగాన్ని కుంగదీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు స్తోన్నారు. ఈ తరహా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వామపక్ష పార్టీలు ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నాయన్నారు. అందులో భాగంగా రౌండ్ టేబులు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడాన్ని రైతాంగం వ్యతిరేకిస్తూ అనేక దఫాలుగా ఆందోళనలు చేశాయన్నారు. ఈ ఆందోళనలతో మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసిందన్నారు. ఇళ్లకు స్మార్టు మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభిస్తుందన్నారు. ఇది ఒక పెద్ద స్కాం అన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభం చేకూరే విధంగా స్మార్టు మీటర్ల కొనుగోలుకు ప్రయివేట్ ఏజెన్సీలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ప్రభుత్వ నిర్బంధాలను అణిచివేత ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు వామపక్షాలు, ప్రజాసంఘాలు, అంగన్ వాడీలు, ఆశాలు చేసే ప్రభుత్వం గృహ నిర్బంధాలు చేయడం, అరెస్టులు చేయడం వంటి కార్యక్రమాలకు పాల్పడి నిరసన కార్యక్రమాలను భగ్నం చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా రాష్ట్రంలో నిరసనలు చేస్తున్న టిడిపి నాయకులను, కార్యకర్తలను గృహనిర్బంధాలు చేయడం దారుణమన్నారు. ఈ దారుణాలన్నింటికి పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు.

న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పరిధిలో ఉన్న దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్రాజెక్టులలో మూడు రూపాయలకే నాణ్యమైన విద్యుత్తు అందుబాటు కాగా ఉన్న థర్మల్ పవర్ స్టేషన్లను ప్రయివేటుపరం చేసి ఇవాళ యూనిట్ ఛార్జిని 10 రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నాయన్నారు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విధానం కార్పొరేట్ కు మొక్కుతూ... బిజెపికి దాసోహం చేస్తుందన్నారు. ప్రభుత్వ నియంత విధానం... నిర్బంధాలపై ప్రజా చైతన్యం కోసం చేస్తున్న ఈ ఉద్యమానికి ప్రజల సహకారం, అవసరమ న్నారు. ప్రపభుత్వ నిర్బంధాలను అణిచివేత కార్యక్రమాలను ఎదుర్కొనేందుకు 10 వామపక్ష పార్టీలు ఏకతాటిపైకి వచ్చి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నాయన్నారు. అందులో భాగంగా భారీగా పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ... ఈనెల 27న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు పిలుపు నిచ్చామని ఈ కార్యక్రమంలో ప్రజలు మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ వెంకమరాజు, మూలె వెంగయ్య, కె.అజయ్ కుమార్, సిపిఎం నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, బత్తల కృష్ణయ్య, నాయకులు లక్ష్మిరెడ్డి, రాంబాబు, యానాదయ్య, పాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పటిష్టంగా "జగనన్న ఆరోగ్య సురక్ష"

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించిన"జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా అమలు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 1/5, రాజీవ్ గాంధీ కాలనీ, 3/2 వెంగల్ రెడ్డి నగర్, 7/1, అరుణాచలం స్ట్రీట్, 7/2 రైతు బజార్ రోడ్డు వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిస్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ అమలును అన్ని సచివాలయాల్లో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వైద్య సదుపాయాలు అవసరమైన అందరికీ చేరువయ్యేలా సచివాలయం హెల్త్ సెక్రటరీ కషి చేయాలని కమిషనర్ సూచించారు.అదేవిధంగా సచివాలయాల్లో పెండింగులోని సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంక్రాంతి అశ్వని, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

24న ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వై.వి.ఆర్.ఆర్. ట్రాన్స్‌పోర్టు సౌజన్యంతో ఈ నెల 24వ తేదీన స్థానిక మైపాడు గేట్ సెంటర్ రోడ్డు, నవాబుపేటలోని కె.పి.ఆర్. కళ్యాణ మండపంలో ఆల్ ఇండియా ఓన్డే ఓపెన్ చెస్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై. సుమన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలల్లో గెలుపొందిన క్రీడాకారులకు రూ.2 లక్షల నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులతో సత్కరించనున్నట్లు తెలిపారు.

గౌరవవేతనం వద్దు..కనీసవేతనం కావాలి

-ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

నినాదాలు చేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-నెల్లూరు

అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం వద్దని.. న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలంటూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సుజాతమ్మ డిమాండ్ చేసింది. శుక్రవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అంగన్‌వాడీలు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లను, హెల్పర్లను, మినీ వర్కర్లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో రాష్ట్రంలో పాదయాత్రలు నిర్వహించే సమయంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాల పెంపు, ఉద్యోగభద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో కంటె ఎక్కువ వేతనాలు ఆంధ్రరాష్ట్రంలో అంగన్‌వాడీలుగా పనిచేసే వారికి అందజేస్తామన్నారన్నారు. ఈ హామీలను నమ్మిన అంగన్‌వాడీలు ఓట్లేసి రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారన్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు అవుతున్నా చేసిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పనిభారం పెంపుదల చేశారన్నారు. అంగన్ వాడీ స్థితి గతులను పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చూపాలంటూ స్థానిక ఎంఎల్ఎలకు సైతం వినతిపత్రం అందజేసినా ఫలితం శూన్యమన్నారు. జగనన్నకు చెబుదాం అన్న కార్యక్రమంలో సైతం అంగన్‌వాడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అటువంటి తరుణంలో ప్రభుత్వం చివర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 25న విజయవాడలో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలకు వెయ్యి రూపాయలు వేతనం పెంచి రూ.10 వేలు విలువ చేసే పనిభారం తమపై ప్రభుత్వం మోపిందన్నారు.ప్రభుత్వం అంగన్‌వాడీలతో పనిచేయించుకుంటున్న సమయంలో ఆ పనికి తగిన విధంగా వేతనం పెంచి అందజేయాలని డిమాండ్ చేశారు. శనివారం అంగన్‌వాడీ హెల్పర్లు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఐద్వా నాయకులు కె.పద్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎల్‌వి.శేషమ్మ, ఏ.కామాక్షి, బి.రజని, సంపూర్ణమ్మ, కల్పన, మల్మెమ్మ, రమాదేవి,శైలజా, సిఐటియు నగర కార్యదర్శి జి. నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిపిఎం నగర నాయకులు మూలం ప్రసాద్, అల్లాడి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు

ప్రజాశక్తి-ఉలవపాడు: ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం మండల జెసిఎస్ కన్వీనర్ వెలిచెర్ల ధన కోటి ఆధ్వర్యంలో కన్వీనర్లకు గృహ సారథులకు జీవిత బీమా నమోదు కార్యక్రమం పై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి మండలం అధ్యక్షులు మాజీ సర్పంచి నన్నం పోతురాజు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే విధంగా పనిచేయాలని ఉద్దేశంతో వాలం టీర్లను కన్వీనర్లను, గృహసారథులను నియమించటం జరిగిందన్నారు. అర్హులైన వైఎస్ఆర్ సీపీ నాయకులకు కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ జీవిత బీమా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జీవిత బీమా నమోదు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సుబ్బరామిరెడ్డి, సుబ్బారెడ్డి, గహసారథులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరు సమీపంలోని ఉప్పుటేరులో బసిరెడ్డి పాలెం రేవు దగ్గర నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిపోతున్న ఇసక లోడు ట్రాక్టర్‌ని సిఐ వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకుని గుడ్లూరు పోలీసులకి శుక్రవారం అప్పగించారు. ఇసుక లోడు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న గుడ్లూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాన్ని గంజాయిప్రదేశ్‌గా మార్చిన వైసిపి

ప్రజాశక్తి-కందుకూరు: నారా చంద్రబాబు నాయుడుపై కుట్ర విషయంలో అంతిమ విజయం న్యాయం వైపే ఉంటుందని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. బాబు ఏ తప్పు చేయలేదు కాబట్టే, దేశ విదేశాల్లో సైతం ఆయనకు రోజురోజుకు మద్దతు పెరుగుతోందన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా, కందుకూరులోని పార్టీ కార్యాలయం వద్ద, తెలుగు యువత, టీడీపీ ఆధ్వర్యంలో 9వ రోజు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు జరిగాయి. దీక్ష ముగింపు సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని రాజకీయ కక్షతో అరెస్టు చేశారా లేదా అన్న విషయాన్ని చిన్న పిల్లలను అడిగినా చెబుతారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ విషయంలో చర్చకి రమ్మంటే వైసీపీ నేతలు నోరు తెరవడం లేదని, కనీసం అసెంబ్లీలో మన పార్టీ ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చే ధైర్యం వారికి లేదన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా, దాని మూలాలు ఆంధ్రప్రదేశ్ నుంచి కనిపిస్తున్నాయని చెప్పారు.కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, పొడపాటి మహేష్, షేక్ మున్నా, చుండూరి శ్రీను, మద్దసాని మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.26 లక్షలు

ప్రజాశక్తి-పొదలకూరు: ఎన్నో ఏళ్లుగా ముస్లిం సోదరుల చిరకాల కోరికగా ఉన్న ఈద్గా (శ్మశాన వాటిక) ప్రహరీ గోడ నిర్మాణానికి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి నుడా నిధుల నుంచి రూ.26 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా శుక్రవారం నమాజ్ అనంతరం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గహంలో పొదలకూరు జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డిలు ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. దశాబ్దాలుగా ఈద్గాకు ప్రహరీ గోడ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని మంత్రి దష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే రూ.26 లక్షల రూపాయలు మంజూరు చేయించారని తెలిపారు. శనివారం పట్టణంలో మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో ఆయన శంకుస్థాపన పనులు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మంత్రి కాకాణికు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత గురువు మౌలానా ముస్తక్ మదని, జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ షేక్ ఖాదర్, వార్డ్ మెంబర్ షేక్ అంజాద్, కో-ఆప్షన్ సభ్యులు దస్తగిరి, నౌరాజ్, రెహమాన్ సాహెబ్, ఆరు మసీదుల ముతవల్లీలు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

బిజెపికి తగిన బుద్ధిచెబుతాం

ప్రజాశక్తి నెల్లూరు సిటీ: ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకపోతే బిజెపి ప్రభుత్వానికి రాజకీయంగా తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సూరిపాక వాసుదేవరావు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు తక్షణమే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా కన్వీనర్ సుధాకర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం నిరంతరం మోసం చేస్తుందని పతనం మొదలైందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఉధతమైన నిరసనలతో మాదిగల సత్తా చాటుతామన్నారు. అనంతరం ఎంఎస్పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పుడు యావత్ మాదిగ జాతి కోరుకుంటున్న ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ఎందుకు పెట్టలేదో సమాధానం చెప్పాలన్నారు. దశాబ్దాల నుండి మాదిగలు ఎస్సీ వర్గీకరణ చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నేతలు రమేష్, ఉదయ కష్ణ, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, జానకి, యేసు, సుజాత, రమణమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

'మూడోసారి ఎంఎల్‌ఎగా 'కాకాణి' గెలుస్తారు'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: రానున్న ఎన్నికల్లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రె డ్డి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని వైసీపీ కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రెండోసారి కన్వీనర్ పగ్గాలు చేపట్టిన సందర్భాని పురస్కరించుకొని శంకరయ్య గౌడ్‌ను వైసీపీ శ్రేణులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకరయ్య గౌడ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మంత్రి గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గం నుంచి అఖండ మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారన్నారు. తనను రెండవసారి మండల వైసిపి అధ్యక్ష బాధ్యతలు కేటాయించడం పట్ల మంత్రి గోవర్ధన్ రెడ్డికి శంకరయ్య గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మండల కన్వీనర్ పదవి రెండవసారి కేటాయించడం ద్వారా తనపై బాధ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. రెండవసారి ఏకగ్రీవంగా మండల వైసీపీ కన్వీనర్ పగ్గాలు చేపట్టిన శంకరయ్య గౌడ్ ను మండల వైసీపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్‌పిటిసి శేషమ్మ, ఎంపీటీసీలు బల్లి చంద్రశేఖర్, ఐ.సరస్వతి, వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరయ్య

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపు లో భాగంగా శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. అనంతరం సబ్ కలెక్టర్ ఆఫీస్ లోని ఎఒఎం. హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు సి. హెచ్.ఇందిరావతి అధ్యక్షత వహించింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 48 సంవత్సరాల నుండి ఇప్పటివరకు గ్రామాల్లో, పట్టణాల్లో పేద ,బడుగు, బలహీన వర్గాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు జీరో నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు సేవలు ప్రభుత్వ నిర్దేశిత ఉద్దేశాలు నెరవేర్చే దశలో అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, అతి తక్కువ గౌరవ వేతనాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి చర్చించి అంగన్వాడీల సమస్యల అన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు వాకాలతారెడ్డి, లింగసముద్రం మండల కార్యదర్శి బి.మార్తమ్మ, గుడ్లూరు మండల అధ్యక్షులు ఎస్ కే పద్మజ ,కత్తి బుజ్జమ్మ, సిహెచ్ రమాదేవి, తిరుపతమ్మ, గీత, ప్రవీణ,జి. రమాదేవి, జ్యోతి, వై.ప్రమీల, సుగుణ, మార్తమ్మ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-కందుకూరు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారంకు ఈనెల 23 నుండి 25వ తేదీ విజయవాడ కార్యక్రమం జరుగుతుందని గతంలో ప్రభుత్వం ఇచ్చిన సమస్యలు పరిష్కరించాలని ఐసిడిఎస్ ను బలోపేతం చేయాలని బడ్జెట్ పెంచాలని ఈ సమస్యలపై కార్యక్రమాలు జరుగుతున్నాయని కందుకూరు ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు రహమతున్నిసా ,అనురాధ, సాతున్, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్ఎ గౌస్ పాల్గొనడం జరిగింది. 23వ తేదీ ఉదయం 9 గంటలకు అంగన్వాడీలు సబ్ కలెక్టర్‌కి అర్జీ ఇవ్వాలి అందరూ కార్యాలయం వద్దకు రావాల్సిందిగా తెలియజేశారు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గాయపడిన వ్యక్తికి 'ఇంటూరి' పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణ 11వ వార్డు టిడిపిఅధ్యక్షుడు, శామీర్ పాలెం గ్రామానికి చెందిన పువ్వాడి వెంకటేశ్వర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం హాస్పిటల్ లో వెంకటేశ్వర్లుని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఆయన వెంట సీనియర్ నాయకులు కంద్రా మాల్యాద్రి, మనికె మాల్యాద్రి ఇతర నాయకులున్నారు.

వైభవంగా అమ్మవారి పండుగ

ప్రజాశక్తి-కందుకూరు

గ్రామ దేవత శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో ఆల యం పునర్నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేసుకొని 16 రోజులైన సందర్భంగా శ్రీ అంక మ్మ తల్లి అమ్మవారికి వైభవంగా 16 రోజుల పండగ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారికి ఆలయ అర్చకులు ఉదయం అభిషేకం నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాలకొండ ఈఓ కేబి శ్రీనివాస రావు, గుడ్లూరు సిఐ సుబ్బారావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కృష్ణవేణి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బ్యాంకు రుణాల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

కార్పొరేషన్ పరిధిలో కేటాయించబడిన ఎ.పి.టిడ్కో (జిప్లస్-3) వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువు పాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లోని 365 ఎస్ఎఫ్‌టి, 430 ఎస్ఎఫ్‌టి గృహాలకు సంబంధించిన బ్యాంకు రుణాల పురోగతి పై కమిషనర్ వికాస్ మర్మత్ సమీక్షించారు. కమిషనర్ కార్యాలయంలో హౌసింగ్,మెప్మా, నగర పాలక సంస్థ హౌసింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారుల స్థానంలో కొత్త వారిని ఎంపిక చేయా లన్నారు. దసరా పండుగలోపు పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని కొత్త లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటా మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లించునట్లు ప్రోత్సహిం చాలని సూచించారు. వివిధ బ్యాంకుల నుంచి మంజూరు కావలసిన లోనులను వెంటనే బ్యాంకు వారిని సంప్రదించి మంజూరు చేయించు యాక్షన్ ప్లాను రూపొందించాలన్నారు. వివిధ కారణాలచేత రిజిస్ట్రేషన్ కానీ వారికి వెంటనే రిజిస్ట్రేషన్ చేయునున్నట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో హౌసింగ్ ఈ ఈ, మెప్మా పి.డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, సి.ఎం.ఎం.ఎస్, సి.ఓస్ నగరపాలక సంస్థ, హౌసింగ్ ఫర్ ఆల్ సూపరింటెండెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఎం.ఎన్.సి ఎం.కోర్‌కు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన 'ప్రకాశం' విద్యార్థులు

ప్రజాశక్తి-కందుకూరు

పవర్ అండ్ ఆటోమేషన్ రంగంలో టెస్టింగ్, కమిషనింగ్ , ప్రొడక్ట్ ట్రేడింగ్ కు ప్రసిద్ధిగాంచిన ఎం.కోర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ శుక్రవారం విడుదల చేసిన ప్రాంగణ ఎంపిక ఫలితాల తుది జాబితాలో 18 మంది ప్రకాశం విద్యార్థులు ఎంపిక య్యారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 16న, ఈ.సీ.ఈ, ఈ.ఈ.ఈ విద్యార్థులకు ఎం.కోర్ సంస్థ ప్రాంగణ ఎంపికలు ఆఫ్ లైన్ , ఆన్ లైన్ మాధ్యమాల ద్వారా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య అభినందిస్తూ ఈ విజయం అపూర్వం అన్నారు. ఇలాంటి కోర్ కంపెనీ ఉద్యోగ అవకాశాలను ఇంకా భవిష్యత్తులో తమ విద్యార్థులకు కల్పించేలాగా కాలేజ్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ నిరంతరం కషి చేస్తున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు డిసెంబర్ నుండి అత్యాధునిక ఈ-డిజైన్, పి.ఎస్ స్టడీస్ , పవర్ ఆటోమేషన్‌లో శిక్షణిస్తారు. తద్వారా కనీస మూడు లక్షల వార్షిక వేతనంతో కోర్ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ ఆఫర్ లెటర్ పొందుతారని తెలిపారు.ఈ ప్రాంగణం ఎంపికలో శ్రీలక్ష్మి, సీత, శ్రీనివాసులు, హారతి, రంగమ్మ, సుమతి, గాయత్రీ, పూజిత, సుహేలాల్, షబీనా, శ్రావణి, లక్ష్మీ మానస తదితర విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రవికుమార్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎం.మీరావలితో పాటు టి.పి.ఓఎస్.బాలకృష్ణ, ప్లేస్మెంట్ కో-ఆర్డినేటర్స్ గద్దె సురేష్, షరీఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యుత్ రంగం ప్రయివేటీకరణలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న విద్యుత్ సంస్కరణలు ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం పొట్టేపాళెం గ్రామంలో విద్యుత్ సంస్కరణలు.. ప్రజలపై భారాలు అన్న అంశంపై బహిరంగ అధ్యయన వేదిక నిర్వహించారు. ఈ బహిరంగ అధ్యయన వేదికలోపాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లు 2022 పేరుతో తీసుకొని రానున్న విద్యుత్ సంస్కరణలకు మన రాష్ట్రం ప్రయోగశాలగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తామని హామీ ఇచ్చి వైసిపి ప్రభుత్వం రూ.10 వేల కోట్లు అదనంగా రుణం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కొత్త రూపాలలో మోసపూరితపు పద్ధతుల్లో భారాలను ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్, విద్యుత్ సుంకం,ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో,డిపాజిట్ చాలలేదని అదనపు డిపాజిట్ పేరుతో జనాలను పీల్చి పిప్పి చేస్తుందన్నారు. అందులో భాగంగా వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల బిగించడం, స్మార్ట్ మీటర్లను తీసుకొని రావడం, ముందుగా డబ్బు చెల్లించి విద్యుత్ వాడుకునే ప్రీపెయిడ్ పద్ధతిని తీసుకొని రావాలని ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. ఈ విధానం అమలులోకి తీసుకురావడంతో దేశంలోనే పెత్తందారులైన అదాని తదితర కార్పొరేట్లకు ఊడిగం చేయాలని చూస్తున్నారన్నారు. దీనిని వామపక్షాలు మేధావులు ప్రజాసంఘాలు ప్రతిఘటించి విద్యుత్ సంస్కరణల భారాలను, ప్రయివేటీకరణ విధానాలను వ్యతిరేకించి పోరాటం సాగించాలని, ప్రభుత్వ రంగంలోనే విద్యుత్ రంగాన్ని కొనసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరి తిరుపాలు, సిపిఎం మండల కమిటీ సభ్యులు పూడిపర్తి జనార్ధన్, ఎడవల్లి రమణయ్య ముత్యాల నాగయ్య, శ్రీపతి వెంకయ్య, అట్లా అనిల్ ఎస్కే అమీర్ బాషా, పర్చూరు ప్రభాకర్, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, బాలు ఆదిశేషయ్య, ముత్యాల ఆదయ్య, పాదర్తి మస్తానయ్య, శ్రీపతి వెంకట శేషయ్య, మరిమేసి కామాక్షయ్య, దువ్వూరు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వేదికలో మాట్లాడుతున్న నాయకులు

ఫైనల్ పరీక్షలకు సంసిద్ధమవ్వాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : వయోజన విద్యలో భాగంగా అక్షరాస్యత -2 ఫైనల్ పరీక్షలకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఉదయగిరి ఎంఇఓ-2 తోట శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 24వ తేదీ ఆదివారం మండలంలోని 17 పంచాయతీలకు సంబంధించి 334 మంది ఫైనల్ పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశామన్నారు. సచివాలయ ఉద్యోగులు, పాఠశాల హెచ్ఎంలు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రంలో ఎలాంటి అసౌకర్యాలు గురికాకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందితోపాటు హెచ్ఎంలపై ఉందన్నారు.

నల్లదుస్తులతో విధులకు హాజరు

ప్రజాశక్తి-ఉదయగిరి : జిపిఎస్ ఆర్డినెన్సుపై ఫ్యాప్టో నిరసన పిలుపు మేరకు నల్ల దుస్తులతో ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. శుక్రవారం మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులు ప్రభుత్వ నిరంకుశ ధోరణి ద్వారా వ్యతిరేకిస్తూ నిరసనగా నల్ల దుస్తులతో విధులకు హాజరయ్యారు. వెంటనే ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల పక్షాన నిలబడి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ గాజులపల్లి సుబ్బారెడ్డి తదితరులున్నారు.

అంగన్వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు శుక్రవారం ప్రత్యేక చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనీష్, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేని 11మంది పిల్లలను గుర్తించి వారికి స్కానింగ్ చేసినట్లు, అంగన్వాడీ కార్యకర్తలు కేంద్రానికి వచ్చే పిల్లల బరువు, ఎత్తులు ప్రతినెలా చూసి రికార్డులు నమోదు చేయాలన్నారు. ఉదయగిరి అంగన్వాడీ సిడిపిఒ పద్మావతి లావణ్య, పిహెచ్ఎన్.సుశీలమ్మ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డిఒ తనిఖీ

ప్రజాశక్తి-కావలి రూరల్ : కావలి తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డిఒ శీనా నాయక్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయ పనితీరుపై సిబ్బందిని అడిగి ఆరా తీశారు. సరైన ప్రగతి లేదని గుర్తించి అసంతృప్తి చెందారు. అర్జీదారుల సమస్యలను జాప్యం చేయవద్దని ఆదేశాలు చేశారు. తహశీల్దార్ ఛాంబర్లో పైలాయింది సిబ్బంది నుండి సమాచారం సేకరించారు. కార్యాలయంలో పనుల తీరుపై పరిశీలించి పలు రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని తెలియజేశారు.

3న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన అక్టోబర్ 3వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో పౌరశుద్యం, తాగునీరు, వైద్యారోగ్యశాఖ, పంచాయతీరాజ్ పనులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్, గృహ నిర్మాణశాఖ, వెలుగు క్రాంతి పథం, రహదారులు, భవనాల శాఖ తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి జెడ్పిటిసి, ఎంపిటిసీలు, సర్పంచ్లు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు సంబంధించిన ఇంటింటి సర్వేను ఎంపిడిఒ ఐజాక్ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లో బీపీ, సుగర్లతో పాటు 7 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. అవసరమైన వారిని గుర్తించి వారికి క్యాంపు నిర్వహణ సమయంలో ప్రత్యేక డాక్టర్ల పర్యవేక్షణలో మరిన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని తెలియజేయాలని సూచించారు. ప్రజలందరూ ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంకయ్య, సచివాలయ కన్వీనర్ రఫీ, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతారామపురం : సమస్యలతో వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సచివాలయ సిబ్బందికి తహశీల్దార్ ఎం వి సుదర్శన్ రావు సూచించారు. మండలంలోని పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. హాజరు, మూమెంట్ రిజిస్టర్, సిబ్బంది విధి నిర్వహణ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క సచివాలయ సిబ్బంది సచివాలయంలో పనివేళలలో అందుబాటులో ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఖచ్చితంగా వేయాలని, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు అందరూ అందుబాటులో ఉండి స్పందన కార్యక్రమం నిర్వహించాలని, సచివాలయంలో సేవలను పెంచాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఎస్జిటి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గం స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం షటిల్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ అండర్-14, 17 పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. మీరు జిల్లా స్థాయిలో జరిగే క్రీడలలో పాల్గొంటారు. ముఖ్య అతిథులుగా ఆత్మకూరు ఎస్ఐఆర్ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చియమ్నాయి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. 23వ తేదీ శనివారం త్రో బాల్ వాల్ బ్యాడ్మింటన్ కబడ్డీ క్రీడలలో అండర్-14, -17 వారికి క్రీడా పోటీలు జరుగుతాయని నియోజకవర్గ కోఆర్డినేటర్ తిరుపతయ్య తెలియజేశారు.

కెఎన్ఆర్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు కెఎన్ఆర్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థిని జి బ్యూలా రోజ్ డిస్కస్ త్రో విభాగంలో తమ ప్రతిభను చాటి ప్రథమ స్థానం సాధించింది. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ పోటీలలో జి బ్యూలా రోజ్ డిస్కస్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా బ్యూలా రోజ్, ఆమెకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ గాయత్రిని కె.ఎన్.ఆర్ మున్సిపల్ హై స్కూల్ హెడ్ మాస్టర్ రవిప్రకాష్ అభినందించారు. ఆమె మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యా సమస్యలపై పర్వతరెడ్డి చర్చ

ప్రజాశక్తి-నెల్లూరు : శాసనమండలిలో విద్య, ఉపాధ్యాయ సమస్యలపై ఎంఎల్సి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక నూతన సంస్కరణలు ప్రవేశపెట్టి, విద్యా ఫలాలను, ప్రతి విద్యార్థికి చేరువ చేస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యా, ఉపాధ్యాయ సమస్యలపై ప్రస్తావించారు. ఎంఇఓ-1, ఎంఇఓ-2 అధికారులకు జాబ్ చార్ట్ అమలు చేయాలని కోరారు. టోఫెల్ శిక్షణ ఇంగ్లీష్ టీచర్లకు అధిక వర్క్ లోడ్ ఏర్పడినందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పరిష్కారం చూపాలని కోరారు. మోడల్ స్కూల్లోని టీచర్లకు 010 అకౌంట్ ద్వారా జీతాలు చెల్లింపుల గురించి మాట్లాడారు.

'చింతాల'కు సత్కారం

ప్రజాశక్తి-కావలి : పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి సినీ ప్రస్థానం 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కావలికి చెందిన ప్రముఖ న్యాయవాది సీనియర్ అభిమాని చింతాల వెంకటయ్యను శుక్రవారం ఆయన కార్యాలయంలో సన్మానించారు. చిరంజీవి అభిమానులు అనేందుకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు. కొట్టే వెంకటేశ్వర్లుతోపాటు కావలి పవన్ కళ్యాణ్ యువత అధ్యక్షుడు. అలా శ్రీనాథ్, రూరల్ యువత అధ్యక్షుడు జి.వెంకయ్య, సుధీర్ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో 'డిఎంఒ'

ప్రజాశక్తి-నెల్లూరు : నగరంలోని కిసాన్నగర్ అర్బన్ హెల్త్సెంటర్ పరిధిలోని శ్రీనివాసనగర్, బివిఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాలను జిల్లా మలేరియా అధికారి ఈ.హుస్సేనమ్మ పర్యవేక్షించారు. శుక్రవారం నగరంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని [illegible] ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కిసాన్ నగర్ యుపిహెచ్సి మెడికల్ ఆఫీసర్ సునీల్ బాబు, డాక్టర్ అస్మిత, కో-ఆర్డినేటర్ వేణు, ఎఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

దౌర్జన్య పాలనకు స్వస్తి పలుకుదాం..

ప్రజాశక్తి-కావలి : నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి మాలేపాటి సుబ్బా నాయుడు ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం వద్ద చేస్తున్న రిలేనిరాహార దీక్షలు శుక్రవారం 9వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఇన్ఛార్జ్తో కలిసి కావలి నియోజకవర్గ పార్టీ, తెలుగు యువత నాయకులు, యువత విభాగం సభ్యులు, నియోజకవర్గస్థాయి పార్టీ కుటుంబ సభ్యులందరూ అధిక సంఖ్యలో కూర్చున్నారు. **ప్రజాశక్తి-ఉదయగిరి** : 40 ఏళ్ల అనుభవం కలిగిన మచ్చలేని చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ జెడ్పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగు మహిళ నాయకులు చేపట్టిన రిలే దీక్షకు ఆయన మద్దతు తెలిపారు.

అసెంబ్లీలో అంగన్వాడీల సమస్యలను చర్చించాలి

ఆర్డిఒకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

ప్రజాశక్తి-కావలి రూరల్

అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం ఆర్డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డిఒ శీనానాయక్కు అర్జీనిచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎస్కె రెహనా బేగం మాట్లాడుతూ గత 48 సంవత్సరాల నుండి ఇప్పటివరకు గ్రామాల్లో పట్టణాల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన గర్భిణులు బాలింతలు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సేవలు ప్రభుత్వ నిర్దేశిత ఉద్దేశాలు నెరవేర్చే దశలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, అతి తక్కువ గౌరవ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనికి తగిన వేతనాలు అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. నిరంతరం రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ అంగన్వాడీల వేతనాలు మాత్రం పెరగకపోవడం చాలా విచారకరమన్నారు. ఇప్పుడు ఇస్తున్న వేతనంతో వారు జీవనం సాగించడం చాలా కష్టమని, వీరికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని గ్రాడ్యుయేట్ అమలు చేయాలన్నారు. వర్కర్లను హెల్పర్లను మినీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. వీరికి ఆఖరి నెల జీతంలో సగం జీతం పెన్షన్గా ఇవ్వాలని రాష్ట్రంలోని మినీ వర్కర్లను తక్షణం మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి చర్చించి అంగన్వాడీల సమస్యల అన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి గౌరవ అధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య, సిఐటియు కావలి పట్టణ కార్యదర్శి ఎర్రంశెట్టి కృష్ణమోహన్, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు టి.మాల్యాద్రి, సిఐటియు నాయకులు పసుపులేటి తిరుపాలు, అంగన్వాడీ నాయకురాలు కే విజయలత, సుభాషిణి, రఘురావమ్మ, శ్రీదేవి, జ్యోతిలక్ష్మి, రాధిక, సుకన్య, బిందు, శాంతి కుమారి, పెంచలమ్మ, రజిత, అరుణ, సౌజన్య, మరియమ్మ, వజ్రమ్మ, తిరుపతమ్మ, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గత 48 సంవత్సరాల నుండి ఇప్పటివరకు గ్రామీణ పట్టణ మురికివాడలో నివసించే పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన గర్భిణులు, బాలింతలు సున్నా నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సేవలు ప్రభుత్వం నిర్దేశిత ఉద్దేశాలు నెరవేర్చే దిశలో అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెర్పర్లు పనిచేస్తున్నప్పటికీ అతి తక్కువ గౌరవేతనంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని అంగన్వాడీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రాధమ్మ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదని, నిరంతరం నిత్యావసర సరుకులు ధరలు డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఆర్టిసి, రైల్వే, ధరలు పెరుగుతూ వేతనాలు మాత్రం పెరగక అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ప్రస్తుతం ఇస్తున్న గౌరవితంతో జీవనం గడపడం కష్టంగా ఉందని తెలిపారు. ఈ మేరకు తమకు కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ మినీ వర్కర్స్ హెల్పర్స్ అందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఫేస్ రికగ్నైజ్ యాప్తో పాటు వివిధ రకాల యాప్లను రద్దుచేసి ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలని తెలిపారు. తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీని రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరి రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఒ కార్యాలయం ఎఒ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న షేక్ ఖాదర్బాషా

వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కావలి

సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కావలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రవి నర్సింగ్ హోమ్, రెడ్క్రాస్, నెల్లూరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంవారి సహకారంతో కావలి పట్టణం వెంగళరావునగర్, ఉదయగిరి రోడ్డు పక్కన ఉన్న శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో 24వ తేదీన ఆదివారం 9 గంటల నుంచి జరుగుతున్న 6వ వైద్య శిబిరంలో కావలి పట్టణం, పరిసర ప్రాంతాల్లోని ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందాలని పలు స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్భాషా తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కావలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రెండు నెలల కోసారి ఈ వైద్య శిబిరం శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో జరుగుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుగర్, బి పి, సాధారణం గుండె జబ్బులు, చిన్న పిల్లల్లో ఫిట్స్ మొదలగు వ్యాధులకు ఉచితంగా టెస్టులు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ.200 అందజేస్తామని తెలిపారు. పేద ప్రజలకోసం సంయుక్త సేవా సంస్థ నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సభ్యులు ఎమ్ అజిత్బాబు, వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో అర్జీల వెల్లువ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ (చేజర్ల)

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

చేజర్ల మండలంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి అర్జీలు ఇచ్చారని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ జిల్లా అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేశారన్నారు. 235 అర్జీలు చేజర్లలో జరిగిన జగనన్నకు చెబుదాంలో వచ్చాయన్నారు. భూ సమస్యలు, సర్వేకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయని, ఇంకా పలు శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందాయన్నారు. ప్రజల సమస్యలు సావధానంగా విని అర్జీలను సంబంధిత అధికారులకు ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. నిర్ణీతకాలవ్యవధిలో పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిపాలనను గ్రామస్థాయికి తీసుకువెళ్లి సమస్యలు లేని కుటుంబాలను చూడాలనే ముఖ్యమంత్రి ఆశయాలకనుగుణంగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో మండల కేంద్రాల్లో ముందుగానే షెడ్యూలు ప్రకటించి ప్రతి బుధవారం, శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఒ బి.చిరంజీవి, డిపిఒ సుస్మితా రెడ్డి, డిఆర్డిఎ, డ్వామా, హౌసింగ్ పిడిలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, సర్వే రికార్డుల ఎడి హనుమాన్ ప్రసాద్, ఐసిడిఎస్ పిడి హేనాసుజన్, డిఇఒ గంగాభవాని, సిపిఒ ఎఎస్ రాజు, పలువురు జిల్లా అధికారులు, స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ, మండల సర్వేయర్, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కావలి రూరల్

కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి నాయకులు శుక్రవారం కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి మల్లి అంకయ్య, సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పోర్తి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు, అందులో భాగంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టామన్నారు. సెప్టెంబరు 24న మున్సిపల్ సర్కిల్లో మానవహారం చేపడుతామని, సెప్టెంబరు 25న జిల్లా కలెక్టర్కు వినతిపత్రాలు అందజేస్తామని, సెప్టెంబరు 26న రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతామని తెలిపారు. కావలి పురపాలక సంఘంలో కార్మికుల సమస్యలపై గతంలో అనేక మార్లు విన్నపాలు ఇవ్వడం జరిగిందని, అయినప్పటికీ పెండింగ్ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. పర్మినెంట్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. యెండ్లూరి ఆదినారాయణ, గుంజి కిషోర్, ప్రభావతి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని స్పార్క్ సిటీ లే అవుట్లో 90 సెంట్లు కాలువ పోరంబోకు సర్వే నెంబర్ 898లో ఆక్రమించి ప్లాట్లు పెట్టి అమ్మి సొమ్ము చేసుకున్న ఆక్రమణదారులపై తగు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడాలని జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి లక్కు ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు చెర్లో రమణారెడ్డి భవన్ (సిపిఎం) కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గంట లక్ష్మీపతి, కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతుందన్నారు. మాజీ మంత్రి మేకపాటి గౌతమ్రెడ్డి కూడా గతంలో పట్టణం ఎలా ఉన్నా కూడా భవిష్యత్తులో ఆక్రమణలకు గురి కాకుండా ఉండాలని ప్రయత్నించారని తెలిపారు. అయితే ప్రస్తుత ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కూడా నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలు పట్టుదల తోటి పరిష్కరించడానికి పూనుకొని రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం కలెక్టర్ను నేరుగా ఆత్మకూరు పట్టణానికి తీసుకుని వచ్చి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారన్నారు. చేజర్ల మండలంలో కూడా అక్కడే రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం కలెక్టర్ సదస్సు నిర్వహించారన్నారు. ఇలా రెవెన్యూ సమస్యలు లేకుండా పాలకవర్గం ప్రయత్నిస్తున్నప్పటికీ ఆత్మకూరు పట్టణంలో రోజురోజుకు ప్రభుత్వ భూములు కొంచెం కూడా లేకుండా ఆక్రమణలకు గురికావడం దారుణంగా ఉందన్నారు. సర్వేనెంబర్ 898 మిగులు జలాల కాలువని ఆక్రమించి లే అవుట్ వేసిన ఆక్రమణదారునికి బదులుగా వేరే స్థలం ఇస్తానన్న ప్రపోజల్ పెట్టాడని, నేరుగా ఆ ప్రపోజల్ జిల్లా అధికారులు ఆత్మకూరు ఆర్డిఒ, తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిందన్నారు. అయితే దానికి 2023 జూలైలో సిసిఎల్ఆర్ నుండి విడుదల చేసిన ఉత్తర్వులు గానీ ఈ భూమి మార్పిడి చెల్లదని స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు. వీటిని ఉల్లంఘించిన ఆక్రమణదారులకు అనుకూలం ఏమి చేసినా అది కోర్టు ధిక్కారమవుతుందన్నారు. కాబట్టి ఇప్పటికైనా అక్రమ ఆక్రమణలు తొలగించాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమానికి లేదా చట్టపరమైన చర్యలకు పూనుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సహకార బ్యాంకు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జలదంకి

మండల కేంద్రమైన జలదంకిలో రూ.45 లక్షల నిధులతో సహకార బ్యాంకు భవన నిర్మాణానికి వైఎస్ఆర్సిపి ఉదయగిరి నియోజక వర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. త్వరలో సొసైటీ కార్యాలయ భవనానికి నిర్మించేందుకు చర్యలు తీసుకున్నట్లు రాజగోపాల్రెడ్డి తెలిపారు. సొసైటీ కార్యాలయానికి స్థలాన్ని మంజూరు చేయాల్సిందిగా జలదంకి తహశీల్దార్ పద్మావతికి సూచించారు. ఈ కార్యక్రమం సొసైటీ అధ్యక్షులు కేతిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. డైరెక్టర్లు మదన్మోహన్ రెడ్డి, ప్రసాద్ నాయుడు, జిల్లా ప్రచార అధ్యక్షులు పాలవల్లి మాలకొండ రెడ్డి, జెడ్పిటిసి శివ లీలమ్మ, ఎన్డిసిసి బ్యాంక్ మేనేజర్ జివి సందీప్కుమార్, సర్పంచులు రావి ప్రసాద్ నాయుడు, కృష్ణారెడ్డి, నాయకులు శేషారెడ్డి, ఆలూరి లక్ష్మీనరసారెడ్డి, వాక శ్రీనివాసులు, రెడ్డి కోర్సి పాటి రామిరెడ్డి, సొసైటీ సిబ్బంది చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.52వేలకు లడ్డు వేలం



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని నువ్వురుపాడు గ్రామ అంబేద్కర్ కాలనీలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నిమజ్జనోత్సవం సందర్భంగా వినాయకుని వద్ద ఏర్పాటుచేసిన స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని ఆ గ్రామానికి చెందిన టంగుటూరి పెంచలయ్య వారు సతీమణి అనసూయమ్మ రూ.52వేల అత్యధిక పాటతో కైవసం చేసుకున్నారు. తన స్వగ్రామంలో తన వీధిలో వెలసిన వినాయకుని ప్రసాద్ లడ్డును తను కైవసం చేసుకోవడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అలాగే స్వామివారి ప్రసాద లడ్డును గ్రామస్తులందరికీ పంపిణీ చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఎఇ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కావలి రూరల్

మాట్లాడుతున్న పసుపులేటి పెంచలయ్య

ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.పెంచలయ్య పేర్కొన్నారు. శుక్రవారం 36వ వార్డు పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో అక్కడ ప్రజలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలు ఇంధన సర్దుబాటు ఛార్జీలు విద్యుత్ సుంకం పేరుతో ఎడాపెడా కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని, మోసపూరితమైన పద్ధతులలో ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేస్తున్నాయన్నారు. ఫిక్సిడ్ ఛార్జీలు కస్టమర్ ఛార్జీలు విద్యుత్ సుంకం ఇలా విడివిడిగా ప్రజలపై భారాలు వేస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా ట్రూ అప్ సర్దుబాటు ఛార్జీల పేరుతో మరో బాదుడు 2021 సంవత్సరం మే లో వాడుకున్న కరెంటుకు కట్టిన బిల్లులు చాలలేదని యూనిట్కు 20 పైసలు చొప్పున మళ్లీ ఇప్పుడు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్లో వాడుకున్న కరెంటుకు లోటు వచ్చిందని మరల బిల్లులలో 40 పైసలు వంతున యూనిట్కు పెంచినట్లు తెలిపారు. ఈ మూడు రకాల భారాలు వల్ల యూనిట్కి 80 పైసలు చొప్పున ప్రజలపై భారం పడిందన్నారు. ఇప్పటికే వీటన్నిటికీ ముఖ్యమైన కారణం విద్యుత్ సంస్కరణలను రాష్ట్రంలో వ్యవసాయానికి అందించే విద్యుత్తు మొత్తం 30 సంవత్సరాలు పాటు అదాని కంపెనీ సరఫరా చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఇప్పటికే విదేశాలలో ఉన్న బొగ్గు గనులు బొగ్గు రవాణా చేసే నౌకాశ్రయాలు ఆదానివే అని అన్నారు. సోలార్తో పాటు ఇప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు తయారు చేసే సంస్థలను అదాని కంపెనీ ప్రారంభిస్తున్నారని తెలిపారు. గతంలో కరెంటు ఛార్జీలు పెంచే అధికారం విద్యుత్ బోర్డుకే ఉండేది అందువల్ల విద్యుత్తు ఛార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడేవని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తెస్తున్న విద్యుత్తు సవరణ బిల్లు వల్ల రాష్ట్రంలో దళితులకు పేదలకు అందుతున్న విద్యుత్తు సబ్సిడీలు పూర్తిగా రద్దయ్యే పరిస్థితిలో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు వలన ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. ప్రజలపై రకరకాల భారాలు మోపుతున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు రాబోయే రోజులలో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజా కార్మిక వ్యతిరేక పరిపాలన సాగిస్తున్న ప్రభుత్వాలపై ప్రజలు సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేడ వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ప్రకారమే రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రభుత్వ అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ రెవెన్యూ రికార్డుల రైతుల వివరాల ప్రకారమే జరుగుతాయని తహశీల్దార్ జగదీష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 20 సంత్సారాలు ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్న రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 20 సంవత్సరాలు ప్రభుత్వ అసైన్డ్ భూములు ఉన్న రైతుల వివరాలను పకడ్బంధీగా తమ సిబ్బందితో అన్ని రెవెన్యూ రికార్డులు పరిశీలించి వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ మంగళవారానికి పూర్తి చేయడం జరుగుతుందని, అనంతరం జాబితాను కార్యాలయం సచివాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ ప్రక్రియలో నమోదు గానీ రైతులు తమతమ వద్ద 20 సంవత్సరాలకు సంబంధించిన రైతు వివరాలను తీసుకువచ్చి వారి వారి పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం నమోదైన ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న రిజిస్ట్రేషన్కు అర్హులన్నారు.

జిపిఎస్ ఆమోదం దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర మంత్రి వర్గం రాష్ట్రంలోని దాదాపు 3లక్షల పైగా ఉన్న సిపిఎస్ ఉద్యోగుల జీవితాలపై జిపిఎస్కు ఆమోదం తెలిపి మరణశాసనాన్ని రాసినట్లు అయిందని పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సిపిఎస్ ఉద్యోగుల జీవితాలపై మరణశాసనం రాసిన ప్రస్తుత ప్రభుత్వం విజయం కోసం చేసే ప్రయత్నంలో సిపిఎస్ను వారంలో రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని నమ్మించి, అవసరం తీరాక ఇచ్చిన హామీని వదిలివేసి వారి జీవితాల్లో జిపిఎస్ అనే మరణ శాసనం రాశారని విమర్శించారు. అయితే కాలంతోపాటు మనుషులు మారుతుంటారని, ఈ విషయంలో ఉద్యోగులు కూడా మినహాయింపు కాదు కాబట్టి వారికి అవకాశం వచ్చినపుడు ఖచ్చితంగా ఏమి చెయ్యాలో చేసి చూపిస్తారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జిపిఎస్ను రద్దు చేసి ఒపిఎస్ను అమలు చేయాలన్నారు.

నేడు దొరసానమ్మ గంథ మహోత్సవం

ప్రజాశక్తి-ఎఎస్పేట

స్థానిక హజ్రత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ సతీమణి హబీబా ఖాతూన్ (దొరసానమ్మ) గంథ మహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు దర్గా ఇఒ మొహమ్మద్ హుస్సేన్ తెలిపారు. స్టేట్ వక్ఫ్బోర్డ్ ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు గంథ మహోత్సవ కార్యక్రమాలన్నీ గతంలో కంటే మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. ఇప్పటికే గంథ మహోత్సవం సందర్భంగా వచ్చే భక్తులకు రెండుపూటల అన్నదానం ప్రత్యేక షామియానాలు బారికేడ్లు మంచినీరు ఏర్పాట్లు చేస్తున్నామని ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున హాజరై వారి ఆశీస్సులు పొందాలన్నారు.

అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని గ్రద్దగుంట గ్రామంలో అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. ఎన్నికల సమయంలో తనకు ఓటు వేయకుండా ప్రతిపక్ష టిడిపికి అనుకూలంగా నడుచుకున్నారన్న కక్షతో ఓ దళితుడి ఇంటి ప్రహరీ గోడను కూల్చే యత్నానికి గ్రామ సర్పంచ్ ఒడిగట్టిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంధర్భంగా బాధితుడు విడవలూరు శ్రీనివాసులు దళితసంఘ నేతలకు మొరపెట్టుకోగా.. దళితసంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు అడ్వొకేట్ ఎస్.మల్లి బాధితుని గృహం వద్దకు చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దళిత నేత మల్లి మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం సర్వే నెంబర్ 155/2 లో సెంట్లు 1.47 యకరా భూమిలో 20 మంది లబ్ధిదారులుగా పూరిల్లు నిర్మించుకున్నారని తెలిపారు. ప్రజానాయకులు జక్కా వెంకయ్య ఎంఎల్ఎ ఉన్నపుడు పక్కా గృహాలకు పునాదులు వేసుకొని క్రమంగా ఇల్లు నిర్మాణాలు జరుపుకున్నారని తెలిపారు. అయితే గత కొంత కాలంగా ఎంపికైన సర్పంచ్ దాసరి మల్లిఖార్జున కక్షపూరితంగా ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాడన్నారు. అధికార పార్టీకి సర్పంచ్ అభ్యర్థినైనా తనకు కాకుండా టిడిపి సానుభూతి పరుడుగా పనిచేయడంతో ప్రతీకారం కోసం వేచి ఉన్నాడని పేర్కొన్నారు. దాంతో బడికి స్థలం కావాల్సి ఉందని, దానికి బడిని ఆనుకొని ఉన్న విడవలూరు శ్రీనివాసులు సంబంధించిన ప్రహరీ గోడను కూల్చేందుకు పనిగట్టుకొని, జగనన్నకు చెబుదాంలో అర్జీ ఇప్పించి, విచారణకు వచ్చిన మండల పరిషత్ అధికారిని శ్రీదేవి, తహశీల్దార్ చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో తన సోదరుడు దాసరి శ్రీహరితో కలసి ఉపాధి ఫీల్డ్ ఆసిస్టెంట్ ప్రశాంత్తో ప్రహరీ గోడను బద్దలు కొట్టేందుకు తెగబడ్డాడని తెలియజేశారు. చుట్టుపక్కల వారు అడ్డుకోవడంతో చేసేది లేక వెనుదిరిగారన్నారు. దళిత వ్యక్తిపై ఇలా దౌర్జన్యానికి దిగడం ఎంతవరకు సబబు అని, ఈ చర్యలను ఖండిస్తున్నామన్నారు. అందునా ఇంట్లో ఎవరూ లేని సమయంలో దౌర్జన్యానికి దిగడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. తమ దళిత సోదరులపై అన్యాయానికి దిగితే చూస్తూ ఊరుకోమని, దళిత సంఘాలతో కలసి ఉద్యమించేందుకు వెనుకాడమని హెచ్చరించారు. అధికారులు నిజానిజాలు తెలుసుకోవాలని, పైగా సంబంధిత వ్యక్తి లేకుండా ఏకపక్షంగా సర్పంచ్ను వెంటేసుకు రావడం వారి హోదాకు తగదన్నారు.

మాట్లాడుతున్న ఎస్ మల్లి

'ఉపాధి' పనులపై విచారణ

ప్రజాశక్తి-జలదంకి

మండలంలోని చామదుల పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులలో చేతివాటం జరిగిందంటూ గ్రామ సర్పంచ్ పలుకూరి సీతారామమ్మ, ఎంపిటిసి పసుపులేటి అమరావతిలో ఇటీవల నెల్లూరు జిల్లా కలెక్టర్కు స్పందనలో వినతి పత్రాన్ని అందజేశారు. విచారణ చేపట్టాల్సిందిగా కలెక్టర్ ఆదేశించడంతో శుక్రవారం ఉదయగిరి నియోజకవర్గం ఎపిడి గాయత్రీ దేవి విచారణ చేపట్టారు. వివిధ మండలాల నుంచి వచ్చిన టెక్నికల్ అసిస్టెంట్లు ఇంటింటికి వెళ్లి విచారించి, నివేదికను ఎపిడికి అందజేశారు. ఉపాధి హామీ కూలీలు గ్రామస్తుల సమక్షంలో ప్రతి పేరును చదివి వీరు పనులకు వచ్చారా రాలేదా అంటూ విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎపిడి గాయత్రి దేవి తెలిపారు. జనాభాను దృష్టిలో ఉంచుకొని శ్యామల పంచాయతీలో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్తో పాటు, మరొక ఫీల్డ్ అసిస్టెంట్ను నియమించాలని ఎపిడికి గ్రామస్తులు విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ చెన్నయ్య, సర్పంచ్ పలుకూరి సీతారామమ్మ, ఎంపిటిసి పసుపులేటి అమరావతి, ఎంపిడిఒ శ్రీధర్ బాబు, సచివాలయ కన్వీనర్ ఒంటేరు చిన్నలక్ష్మీ నరసారెడ్డి, పంచాయతీ సెక్రటరీ బుజ్జమ్మ, నాయకులు పసుపులేటి ప్రసాదు, కోటిరెడ్డి, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.